ప్రజాశక్తి
ఆదివారం 22 అక్టోబరు 2023 | 5 | శ్రీకాకుళం

వ్యవసాయ, అనుబంధ రంగాల్లో పనులను గుర్తించాలి

పొందూరు: 2024-25 ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాల్లో చేపట్టాల్సిన పనులను వేగంగా గుర్తించి అంచనాలను తయారు చేయాలని పిఆర్ అండ్ ఆర్‌డి జాయింట్ కమిషనర్ డాక్టర్ మన్నె అశోక్ అధికారులను ఆదేశించారు. పొందూరు మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో ఎన్‌ఆర్‌ఇజిఎస్, వ్యవసాయ, వెటర్నరీ అధికారులతో శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధి హామీలో చిన్న సన్నకారు రైతులకు మొక్కలను అందజేసి మూడేళ్ల పాటు ఆ మొక్కల నిర్వాహణకు అయ్యే వ్యయాన్ని అందజేయనున్నామని తెలిపారు. అనంతరం మలకాంలో రహదారుల పక్కన నాటిన మొక్కలను, ఉపాధి హామీ నిధులతో నిర్మించిన సెరీకల్చర్ షెడ్లనుఎ తండ్యాం పంచాయతీ బొట్లపేటలో కొబ్బరి మొక్కల పెంపకాన్ని పరిశీలించారు. ఎచ్చెర్ల క్లస్టర్ ఎపిడి కె.లోకేష్, ఎంపిడిఒ సీపాన హరిహరరావు, ఎంఇఒ రామరాజు, ఎఇ బెండి బాజ్జీ, ఎపి శ్రీనివాసరావు ఉన్నారు.

అమాత్యా... అసమర్థులెవరు?

- వంశధార ఆధునికీకరణ ఫైల్‌కు క్లియరెన్స్ తీసుకురాలేని వైనం
- షట్టర్ సమస్యకూ చొరవ చూపని మంత్రి అప్పలరాజు
- శివారు భూములకు సాగునీటి సమస్య పునరావృతం
- సాగు నీరివ్వలేకపోయారంటూ అధికారులపై నిందలు

నందిగాం మండలం నరేంద్రపురంలో షట్టర్ల దుస్థితి

పంట కాలువలు పటిష్టంగా ఉండి నీరు సాఫీగా ప్రవహించే అవకాశం ఉంటే చిట్టచివరి భూమి వరకు సాగునీరందుతుంది. దీంతో పాటు కాలువలపై నిర్మించిన షట్టర్లు సరియైన స్థితిలో ఉంటే సాగు నీటి ప్రవాహానికి అడ్డే ఉండదు. వంశధార కుడి, ఎడమ కాలువలకు ప్రస్తుతం ఇవే లోపించాయి. కాలువల ఆధునికీకరణ, షట్టర్ల సమస్య, గుర్రపు డెక్క, పూడిక వంటి సమస్యలపై చాలా ఏళ్ల నుంచి ప్రభుతానికి అధికారులు మొరపెట్టుకుంటున్నా స్పందన లేకపోవడంతో శివారు భూములకు సాగునీరు అందని పరిస్థితి ఈ ఏడాదీ పునరావృతమైంది. ప్రభుత్వస్థాయిలో పరిష్కారించాల్సిన ఈ సమస్యలను నాలుగున్నరేళ్లుగా విస్మరించి సాగునీరందించడంలో విఫలమయ్యారంటూ మత్స్యశాఖ, పశు సంవర్ధక మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అధికారులపై నిందించడంపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

హిరమండలం మండలం గొట్టా బ్యారేజీ నుంచి నీటిని విడిచిపెడుతున్న ఎడమ కాలువ పరిస్థితి దయనీయంగా ఉంది. ఎడమ కాలువ ద్వారా 2,480 క్యూసెక్కుల నీరు విడిచి పెట్టేలా కాలువను డిజైన్ చేశారు. 40 ఏళ్ల కిందట రాతితో నిర్మించిన నిర్మాణాలు ప్రస్తుతం దెబ్బతినడంతో ఎడమ కాలువ సామార్థ్యం అంతకంతకూ తగ్గిపోతోంది. ఎడమ కాలువను ఆధునికీరించాల్సిన అవసరం ఉందంటూ గత తొమ్మిదేళ్లుగా అధికారులు ప్రతిపాదనలు పంపుతునే ఉన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత 2019లో మొదటి సారి పంపారు. 2021 మార్చిలో రూ.776 కోట్లతో, 2022 నవంబరులో రూ.954 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. కాలువ ఆధునికీరణ పనులు జరిగి ఉంటే పలాస, వజ్రపుకొత్తూరు మండలాల్లోని శివారు భూములకూ సాగునీరు అందేది. వైసిపి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి మంత్రిగా పనిచేస్తున్న డాక్టర్ సీదిరి అప్పలరాజు ఈ ఫైల్‌కు క్లియరెన్స్ తీసుకురావడంలో విఫలమయ్యారన్న విమర్శలు వినిపిస్తున్నాయి

షట్టర్ల సమస్యపై ఏదీ చొరవ?

నరసన్నపేట వంశధార డివిజన్‌లో 2009లో చోటు చేసుకున్న షట్టర్ల కొనుగోళ్ల అవినీతిపై సిఐడి కేసు నమోదు చేసింది. దీనిపై నేటికీ హైకోర్టులో విచారణ సాగుతోంది. విచారణ పెండింగ్‌లో ఉండటంతో కాలువలపై కొత్త షట్టర్లను ఏర్పాటు చేసుకోలేని పరిస్థితి నెలకొంది. దీంతో కొత్తగా షట్టర్లు ఏర్పాటు చేసుకోలేక, పాడైన వాటితోనే నెట్టుకురావాల్సిన పరిస్థితి నెలకొంది. అదీగాక హిరమండలం, నరసన్నపేట, టెక్కలి గొడౌన్లలో రూ.4 నుంచి రూ.5 కోట్ల విలువ చేసే షట్టర్లు నిరుపయోగంగా పడి ఉన్నాయి. ఈ అంశంపై వంశధార ఇంజినీరింగ్ అధికారులు అనేక పర్యాయాలు మంత్రి అప్పలరాజుతో పాటు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బొత్స సత్యనారాయణ దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకపోయింది. ముఖ్యమంత్రి జగన్ మాత్రమే పరిష్కరించగలిగిన ఈ సమస్యను మంత్రి అప్పలరాజు ఏనాడూ సిఎం దృష్టికి తీసుకువెళ్లలేదు. ఇరిగేషన్ సెక్రటరీతో మాట్లాడానంటూ వ్యవసాయ సలహా మండలి గత రెండు సమావేశాల్లో చెప్పుకొచ్చారు.

మూడేళ్లు బిల్లులు చెల్లించని ప్రభుత్వం

వంశధార కుడి ఎడమ కాలువలపై కేటగిరి 'ఎ' కింద వివిధ రకాల పనులు చేపట్టారు. జంగిల్ క్లియరెన్స్, పూడిక తీత, స్ట్రక్చర్ల నిర్మాణాల కోసం 2021-22లో రూ.4.4 కోట్లతో పనులు చేశారు. పనులు చేసిన కాంట్రాక్టర్లకు ప్రభుత్వం ఇప్పటివరకు బిల్లులు చెల్లించలేదు. దీంతో కొత్తగా పనులు చేసేందుకు ఒక్క కాంట్రాక్టరూ ముందుకు రావడం లేదు.

జిల్లా నిధుల నుంచే గుర్రపుడెక్క తొలగింపు పనులు

కాలువల్లో పెద్ద ఎత్తున గుర్రపుడెక్క పేరుకుపోవడంతో నీరు సాఫీగా ప్రవహించని పరిస్థితి ఏటా తలెత్తుతోంది. ప్రభుత్వానికి నిధులు అడుగుతున్నా విడుదల చేయకపోవడంతో జిల్లా అధికారులు వివిధ రకాల ఫండ్స్ నుంచి అత్యవసరంగా నిధులు మంజూరు చేస్తున్నారు. గుర్రపుడెక్క తొలగింపునకు ఈ ఏడాది జూలైలో రూ.40 లక్షలు ఇచ్చారు. 2022 జూలైలో రూ.44 లక్షలు, ఆగస్టులో 19.5 లక్షలు కేటాయించారు. 2021లో రూ.15 లక్షలు విడుదల చేశారు. కాలువల్లో గుర్రపుడెక్క తొలగింపుతో ఆ మాత్రమైనా నీరందించగలుగుతున్నారు.

రెండేళ్లు కాలువ అభివృద్ధి పనులు పెండింగ్

ఎడమ కాలువ ద్వారా శివారు భూములకు సాగు నీరందించాలంటే తాత్కాలికంగానైనా అభివృద్ధి పరచాల్సిన అవసరముందని వంశధార ఇంజినీరింగ్ అధికారులు ప్రభుత్వానికి 2021 జూలైలో ప్రతిపాదనలు పంపారు. కాలువ సామార్థ్యం పెంపు కోసం ముఖ్యమైన స్ట్రక్చర్స్, పూడికతీత తొలగింపునకు ఎడమ కాలువ కోసం రూ.5.5 కోట్లు, కుడి కాలువ కోసం రూ.4.5 కోట్లు కావాలని ప్రభుత్వానికి నివేదించారు. రెండేళ్లు గడచినా వాటికీ దిక్కులేకుండా పోయింది.

రైతుల ఆగ్రహాన్ని అధికారులపై నెట్టే ప్రయత్నమేనా?

జిల్లాలో ఒకవైపు వర్షాభావ పరిస్థితులు, మరోవైపు వంశధార నీరు రాక పొలాలు ఎండిపోతున్నాయి. దీంతో రైతుల్లో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. పలాస నియోజకవర్గానికి చెందిన కొంత మంది రైతులు టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి గౌతు శిరీషతో కలిసి ఈ నెల 16న స్పందనలో కలెక్టర్‌కు సైతం ఫిర్యాదు చేశారు. ఈ పరిణామాలతో అసహనానికి గురైన మంత్రి అప్పలరాజు అధికారులను లక్ష్యంగా చేసుకున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అందులో భాగంగానే ఈ నెల 20న కలెక్టరేట్‌లో నిర్వహించిన వ్యవసాయ సలహా మండలి సమావేశంలో అధికారులపై విరుచుకుపడ్డారన్న చర్చసాగుతోంది. నిర్ణయాలు తీసుకునే స్థానంలో ఉండి, సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లేందుకు చొరవ చూపకుండా అధికారులను నిందించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మాట్లాడుతున్న స్పీకర్ సీతారాం

నిస్వార్థ శ్రామికులు పోలీసులే

అమరవీరులకు నివాళ్లర్పించిన స్పీకర్, కలెక్టర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రజల కోసం పోరాడుతూ అమరవీరులైన పోలీసులను స్మరించుకోవడం అందరి బాధ్యతని, నిస్వార్థ శ్రామికులుగా పోలీసులు సేవలు అందిస్తున్నారని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్‌పి జి.ఆర్ రాధిక ఆధ్వర్యాన నిర్వహించిన పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం శనివారం నిర్వహించారు. స్పీకర్‌తో పాటు కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, జెసి ఎం.నవీన్, జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా, ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనాలు పోలీసు అమరవీరుల స్థూపం వద్ద పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ వివిధ రకాల నేరాలు పెరిగిపోతున్నాయని, నేరాల నివారణకు స్వీయ నియంత్రణ చాలా అవసరం ఉందని అన్నారు. ప్రకృతి వైపరీత్యాలు తుపాను, కరోనా కష్ట కాలంలో పోలీసులు అందించిన సేవలు మరువలేనివి అని కొనియాడారు. సమాజ రక్షణ, భద్రత కోసం పోలీసు సిబ్బంది అహర్నిశలు విధులు నిర్వహిస్తున్నారనిఅన్నారు. ప్రభుత్వపరంగా అన్ని విధాలా సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల కోసం నిరంతర పోరాటం చేస్తున్న పోలీసు సేవలు అభినందనీయమన్నారు. జిల్లా పోలీసులు ప్రకృతి వైపరీత్యాలు, ఉత్సవాలు, కోవిడ్ నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ, అంతర్గత భద్రత, మావో ప్రభావిత ప్రాంతాల్లో అందించిన సేవలు మరువలేనివని చెప్పారు. ఇలాంటి సమయంలో ప్రాణాలు కోల్పోయిన వారిని స్మరించుకోవడం అందరి బాధ్యత అని గుర్తు చేశారు. ఎస్‌పి మాట్లాడుతూ విధి నిర్వహనే పరమావదిగా భావిస్తాం మేము అని అన్నారు. 1958 అక్టోబరు 21న భారత చైనా సరిహద్దుల్లో దేశంకోసం తమ ప్రాణాలర్పించిన ఆశువులు బాసిన అమరవీరులకు నివాళ్లర్పిస్తూ... పోలీసుల అమరవీరుల దినోత్సవంగా ఏటా నిర్వహించుకుంటున్నామని అన్నారు. జిల్లాలోని విధినిర్వహణలో అమరులైన ఐగురు పోలీసులు ఎస్.బంగారు నాయుడు, ఎ.పాపారావు, ఎం.నరేంద్రదాస్, ఎం.వెంకటరమణ, పి.కృష్ణమూర్తి ప్రత్యర్థి దాడుల్లో అమరులై ప్రాణాలు అర్పించారని తెలిపారు. ఈ ఏడాది జిల్లాకు చెందిన 9 మంది విధి నిర్వహణలో వీరమరణం పొందారని, అటువంటి వారికి నివాళ్లర్పించడం మన భాధ్యత అన్నారు. జిల్లా పోలీసు శాఖ బాధిత కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. అనంతరం జిల్లా పోలీసు శాఖ రూపొందించిన అమర వీరుల గ్రంథంలో దేశ రక్షణలో ప్రాణ త్యాగం చేసిన 188 అమర వీరుల పేర్లను పుస్తకాన్ని స్పీకర్‌కు ఎస్‌పి అందజేశారు. అదనపు ఎస్‌పి టి.పి.విఠలేశ్వరావు దేశ రక్షణలో ప్రాణ త్యాగం చేసిన 188 పేర్లు చదివి వినిపించారు. విధినిర్వహణలో అమరుల త్యాగాలు ప్రతిఫలం గుర్తుగా వారి కుటుంబాలకు ఘనంగా సన్మానించి జ్ఞాపకాలను అందజేశారు. కార్యక్రమంలో సెబ్ ఎస్‌పి ఎన్.వి.మణికంఠ, డిఎస్‌పి వై.శృతి, డి.బాలేచంద్రారెడ్డి, జి.నాగేశ్వరరెడి, బాలరాజు పాల్గొన్నారు.

ట్రాప్ కెమెరాలకు చిక్కిన పులి

ప్రజాశక్తి- పలాస

కెమెరాకు చిక్కిన పుల్లి

ఆంధ్రా-ఒడిషా సరిహద్దు ప్రాంతంలో మెళియాపుట్టి మండలం గొప్పిలి సమీపంలో ఉన్న గందాహతి పర్యాటక ప్రాంతంలో పెద్ద పులి సంచరిస్తోందన్న అనుమానాలు నిజమయ్యాయి. ఇటీవల రెండు రోజుల క్రితం సంతోష్ పూర్ గ్రామానికి చెందిన ప్రింటూ నాయకికి చెందిన ఆవు కళేబరం గ్రామ సమీపంలోని కొండ ప్రాంతంలో లభ్యమైంది. విషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని చుట్టుపక్కల పరిశీలించారు. ఒక జంతువు పాదము ముద్రలు కనిపించాయి. వాటి ఫొటో తీసి ఆ చిత్రాలను భువనేశ్వర్‌లోని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు. ల్యాబ్ నివేదికలు చూడగా అవి పులి పాదముద్రలుగా ప్రాథమికంగా నిర్ధారించారు. దాంతో ఏయే ప్రాంతాల్లో సంచరిస్తోందో గుర్తించిన అటవీ అధికారులు 5 ట్రాప్ కెమెరాలను అమర్చారు. 2 ట్రాప్ కెమెరాలకు పులి సంచరిస్తున్న దృశ్యాలు చిక్కాయని ఒడిశా అటవీశాఖ అధికారి అశోక్‌కుమార్ బెహరా తెలిపారు. పులి ఏడు అడుగుల పొడవు ఉందని, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అడవు లోకి వెళ్ల వద్దని, ఒంటరిగా సంచరించ వద్దని హెచ్చరించారు. ఆవులు, కోళ్లు, మేకలు, గొర్రెలను వదిలేయి వద్దన్నారు. ప్రజలెవరూ భయాందోళనకు గురి కావొద్దన్నారు.

సాగునీరు అందించడంపై ప్రత్యేక శ్రద్ధ

జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మాట్లాడుతున్న జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ

జిల్లాలో వర్షాభావ పరిస్థితులపై నీటిపారుదలశాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి రైతాంగానికి సాగునీరందించాలని జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ ఆదేశించారు. జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో శనివారం జెడ్‌పి స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహించారు. 1,2,4,7వ స్థాయీ సంఘాల సమావేశాలకు ఆమె అధ్యక్షత వహించారు. ప్రధానంగా రైతాంగం సాగునీటి కోసం తీవ్ర అవస్థలు పడుతున్నారని, వంశధార నదిలో నీటి నిల్వలు ఉన్నా సాగునీరు అందించలేకపోవడంపై రైతుల్లో ఆందోళన ఉన్నారని అన్నారు. పలాస, వజ్రపుకొత్తూరు, నందిగాం మండలాలకు సాగునీరందడం లేదని జెడ్‌పిటిసి సభ్యులు సమావేశంలో ప్రస్తావించారు. అలాగే నారాయణపురం, తోటపల్లి ఆయకట్టుకు నీరందని పరిస్థితి ఉందన్నారని సభ్యులు తెలిపారు. దీనిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు. గృహ నిర్మాణశాఖ, సహకారశాఖ, డిసిసిబి, చేనేత, జౌళీశాఖ, ఖాదీ గ్రామీణ పరిశ్రమల శాఖ, జిల్లా పంచాయతీశాఖ, జిల్లా నీటి యాజమాన్యశాఖ, పరిశ్రమలశాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ, విద్యాశాఖ, వైద్య, ఆరోగ్యశాఖ, ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖల పనితీరును సమీక్షించారు. అమదాలవలస-శ్రీకాకుళం రోడ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ రోడ్డు నిర్మాణం పనులు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ప్రస్తావించారు. సమావేశంలో జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకటరామన్, జెడ్‌పిటిసిలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

21 కేసుల పరిష్కారం

శ్రీకాకుళం అర్బన్ : ప్రత్యేక లోక్ అదాలత్‌లో 21 మోటార్ ప్రమాద కేసుల పరిష్కారమైనట్లు జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా తెలిపారు. జిల్లాలో శనివారం నిర్వహించిన ప్రత్యేక లోక్ అదాలత్‌లో మోటార్ ప్రమాద కేసులు రాజీ అయినట్లు తెలిపారు. ఇన్సూరెన్స్ కంపెనీలు మొత్తం 21 కేసుల్లో కక్షిదారులకు రూ.67.45 లక్షల పరిహారం చెల్లించేందుకు రాజీ కుదుర్చుకున్నారని తెలిపారు. ఫ్యామిలీ కోర్టు జడ్జి భాస్కరరావు లోక్ అదాలత్ ప్రొసైడింగ్ అధికారిగా వ్యవహరించారు. న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, న్యాయవాదులు న్యాయవాది వేమూరి హరిప్రియ, గేదెల ఇందిరాప్రసాద్, ఇన్సూరెన్స్ స్టాండింగ్ కౌన్సిల్ మంచు జనార్ధనరావు పాల్గొన్నారు.

రైతులపై చిన్నచూపు తగదు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

వర్షాభావ పరిస్థితులకు తోడు వంశధార నదిలో నీరు ఉన్నప్పటికీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో భైరిదేశి గెడ్డకు నీరు రాక పంట పొలాలకు సాగునీరందక రైతులు అవస్థలు పడుతున్నారని టిడిపి నాయకులు, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు జిల్లా గొండు శంకర్ ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీకాకుళం రూరల్ మండపంలోని పొన్నాం వద్ద ఉన్న భైరిదేశిగెడ్డను శనివారం టిడిపి నాయకులు, రైతులు సందర్శించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతులపై చిన్నచూపు చూస్తోందని, సాగునీరందక వేలాది ఎకరాల పంటలు ఎండిపోయి బీడు భూములుగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వంశధార నదిలో పుష్కలంగా నీరు ఉన్నా అధికారులు వేలాది క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి వృథా విడిచి పెడుతున్నారని అన్నారు. రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు గతంలో ఈ ప్రాంతంలో పర్యటించారని, అయినా రైతుల సమస్యలు పరిష్కారించడంలో పట్టించుకోలేదని విమర్శించారు. వేలాది క్యూసెక్కుల నీరు సముద్రంలో వృథాగా పోతుంటే నీటిపారుదల శాఖ మంత్రిగా చెప్పుకునే మల్లెపూల మంత్రి అంబటి రాంబాబు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. మంత్రులు వాస్తవాలు మరిచి రైతులను మభ్య పెట్టే మాటలు మానుకోవాలని హితవుపలికారు. భైరిదేశి గెడ్డ ఓపెన్ హెడ్ ఛానల్ దగ్గర నీటిని అడ్డుకట్ట వేయకుండా ఆప్రాంతంలోనే ఇసుకదందా చేస్తున్నారని విమర్శించారు. హెడ్ స్లూయిస్ మొదలు ప్రధాన కాలువ ఉన్న అంబళ్లవలస, తంగుళ్లపేట, గార, కొర్ని, కొర్లం, తొంనగి, వమరవిల్లి, కళింగపట్నం గ్రామాల రైతులకు నీరు అందడం లేదన్నారు. కార్యక్రమంలో ఎఎంసి మాజీ చైర్మన్ మూకళ్ల శ్రీను, శాలిహుండం సర్పంచ్ కొంక్యన ఆదినారాయణ, మండల తెలుగు యువత ప్రెసిడెంట్ గురువు లక్ష్మణ, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి కంచు దశరథ, గార మండల పార్టీ అధ్యక్షులు గొండు వెంకట రమణమూర్తి, భైరి మాజీ సర్పంచ్ ఎండు చిన్నారావు, భైరివానిపేట సర్పంచ్ భైరి నరేష్, తండెంవలస ఎంపిటిసి మాజీ సభ్యులు అంబటి వైకుంఠం, బడగల వెంకటప్పరావు పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న టిడిపి నాయకులు, రైతులు

కొత్త ఆలోచనలు, వ్యూహాలు

నేటి రాష్ట్ర రాజకీయాలు సంక్లిష్టమై సంక్షోభితంగా తయారవుతున్నాయి. ఫలితంగా ప్రధాన పార్టీలో ప్రజా సమస్యలను పక్కనబెట్టి పరస్పర దూషణలకు ప్రాధాన్యత ఇవ్వడం చూస్తున్నాం. జిల్లాలోనూ అందుకు మినహాయింపు లేదు. ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా జెండాతో ముందుకెళ్తున్నాయి. అలాంటి పరిస్థితుల్లో చంద్రబాబు 40 రోజులుగా రిమాండ్‌లో ఉండడంతో చివరికి ఆ పార్టీ ఆత్మరక్షణలో పడినట్లు కనిపిస్తుంది. అధికార పార్టీ దూకుడు పెంచింది. జిల్లాలో మార్పులు, చేర్పులు చేయాల్సిన అభ్యర్థుల ఎంపికపై రసవత్తరమైన కసరత్తు ప్రారంభించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఉత్తరాంధ్ర మంత్రులు, జిల్లా నేతల దృష్టి ప్రత్యేకంగా టెక్కలి నియోజకవర్గం పడినట్లు తెలిసింది. టెక్కలి నియోజకవర్గంలో గత ఎన్నికల నుంచి జరుగుతున్న చరిత్ర అందుకు కారణమైనట్లు తెలిసింది. ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌పై అధినేత జగన్ ప్రత్యేక దృష్టి ఉన్నట్లు తెలిసింది. ఆయనను గత ఎన్నికల్లో పార్లమెంట్‌కు పోటీ పెట్టి శాసనసభకు పి.తిలక్‌కు పంపించే ప్రయత్నం చేశారు. ఆ రెండు ప్రయత్నాలూ నేతలు సఫలం చేయడంలో విఫలమయ్యారు. ఆ తరువాత ఆ నియోజకవర్గంలో గ్రూపు రాజకీయాలు ఊపందుకున్నాయి. ఫలితంగా దువ్వాడ శ్రీనివాస్‌కు ఇన్‌ఛార్జి పదవి కట్టబెట్టారు. ఆ తరువాత శాసనమండలికి పంపించారు. దీంతో మళ్లీ టెక్కలి తనకే వస్తుందని తిలక్ భావించినట్టు తెలిసింది. ఆ తరువాత జగన్ నియోజకవర్గంలో గాలినితీసేశారు. టెక్కలి అభ్యర్థి దువ్వాడ శ్రీనివాసేనని, అందరూ నేతలూ గెలిపించుకుని రావాలని సభలో జగన్ పిలుపునిచ్చారు. అక్కడితో సమస్య కొత్త రూపం దాల్చింది. దువ్వాడ శ్రీనివాస్ దంపతుల మధ్య వచ్చిన బేదాభిప్రాయాలు నియోజకవర్గం రాజకీయాలపై తీవ్ర ప్రభావం చూపాయి. గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో కొత్త సమస్యలు ప్రచారంలోకి వచ్చాయి. చివరికి అధినేత వద్ద ఫిర్యాదు చేసే తీవ్రస్థాయికి పరిణామాలు చోటు చేసుకున్నాయి. అనంతరం దువ్వాడ శ్రీనివాస్ చేసిన ప్రకటన రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. ఇక నుంచి నియోజకవర్గం ఇన్‌ఛార్జిగా దువ్వాడ వాణి ఉంటారని, ఎన్నికల్లో ఆమెకే టిక్కెట్ వస్తుందని ఈ విషయం జగన్ చెప్పమన్నారని పాత్రికేయుల సమావేశంలో శ్రీనివాస్ ప్రకటించడం విశేషం. దీంతో కుటుంబాంలోని బేదాభిప్రాయాలు సమసిపోయాయని నేతలు భావించినట్లు తెలిసింది. అది వారి భావనగానే మిగిలిపోయింది. పరిస్థితులు మరింత తీవ్రతరమైనాయని జరిగిన పరిణామాలు చెబుతున్నాయి. దీంతో జిల్లా ముఖ్య నేతలు, ఉత్తరాంధ్ర కో-ఆర్డినేటర్ సుబ్బారెడ్డి, ఇన్‌ఛార్జి బొత్స సత్యనారాయణ సమక్షంలో జిల్లాలోని ముఖ్య నేతలతో చర్చించి ఒక నిర్ణయానికి వచ్చారని రాజకీయాల్లో ప్రచారం మొదలైంది. టెక్కలి నియోజకవర్గ సమస్య పరిష్కారానికి ఆ కుటుంబం నుంచే కొత్త వారిని తీసుకురావాలని భావిస్తున్నట్లు తెలుస్తుంది. ఇప్పటికే రాజకీయాల్లో ప్రవేశించిన డాక్టర్ ధానేటి శ్రీధర్‌ను టెక్కలి బరిలో దించాలన్న ఆలోచన చేస్తున్నారని తెలిసింది. దువ్వాడ శ్రీనివాస్‌కు డాక్టర్ శ్రీధర్ తోటల్లుడవుతారు. ఈ ప్రతిపాదనను నేతలు జగన్ వరకు తీసుకెళ్లారని తెలిసింది. కారణాలు ఏమైనాప్పటికీ శ్రీనివాస్‌పై జగన్‌కు ప్రత్యేక అభిమానం ఉన్నట్లు స్పష్టమైంది. ఆ ప్రతిపాదనను ఆయన ఆమోదం తెలుపుతారా! అన్నది చర్చనీయామైంది. అంతేకాదు ఈ సరికొత్త ప్రతిపాదనకు శ్రీనివాస్, వాణి అంగీకరించాల్సి ఉంటుంది. లేకుంటే కథ మళ్లీ మొదటికి వస్తుంది. అందువల్ల టెక్కలి నియజకవర్గంలో అభ్యర్థి ఖరారు విషయంలో అంత తొందరగా కొలిక్కి వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. నరసన్నపేట నియోజ కరవ్గంలో అభ్యర్థి మారనున్నట్లు స్పష్టమవుతుంది. మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్ పార్లమెంట్ అభ్యర్థిగా బరిలో నిలవనున్నారని తెలిసింది. ఆయన స్థానంలో తనయుడు కృష్ణచైతన్యను బరిలో దించనున్నారని తెలిసింది. తన తనయుడికి టిక్కెట్ ఇస్తే తాను ఎంపీగా బరిలో దిగడానికి సిద్ధమేనని జగన్‌కు కృష్ణదాస్ చెప్పినట్లు తెలిసింది. అందువల్ల ఇన్నాళ్లు ప్రతిష్టంభనలో ఉన్న పార్లమెంట్ టిక్కెట్ దాదాపు ఖరారైనట్లు భావిస్తున్నట్లు తెలిసింది. టెక్కలి సీటు గెలవడమన్నది వైసిపికి ప్రతిష్టగా మారింది. ఆ సీటుతో పాటు ఎంపీ సీటుకూ నష్టం లేకుండా చర్యలు త్వరితగతిన తీసుకోవడంలో జిల్లా నేతల జోక్యం ఉన్నట్లు తెలిసింది. ఎచ్చెర్ల నియోజకవర్గంలో రాజకీయ చిత్రం రంగులు మారుతున్నట్లు తెలిసింది. ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ స్థానంలో ఇన్‌ఛార్జి మంత్రి బొత్స మేనల్లుడు చిన్న శ్రీను రంగప్రవేశం చేయడానికి పావులు కదపుతున్నారని తెలిసింది. ఆ నియోజకవర్గంలో అసమ్మతి గూడుకట్టి ఆ బృందాన్ని జగన్ వద్దకు తీసుకెళ్లడంలో సఫలీకృతమైనట్లు తెలిసింది. కిరణ్‌కుమార్‌కు బదులు చిన్న శ్రీనుకు టిక్కెట్ ఇస్తే మోమందరం కలిసి గెలిపించుకొస్తామని ఆ బృందం జగన్‌తో చెప్పినట్లు విశ్వసనీయంగా తెలిసింది. అందువల్ల జిల్లా నేతల్లో ఎచ్చెర్ల నియోజకవర్గం అభ్యర్థి ఎంపిక చర్చనీయాంశంగా ఉందని తెలిసింది. ఇచ్ఛాపురం నియోజకవర్గంలో నర్తు రామారావును ఎమ్మెల్సీ చేయడం ద్వారా గ్రూపు రాజకీయాలకు తెరదించుతామన్న జగన్ అభిప్రాయానికి ఎదురు గాలి మొదలైంది. యాదవ్ సామాజికవర్గంలోని కొందరు నేతలు రెడ్డిక సామాజిక వర్గాన్ని కదిలించి మీరు టిక్కెట్ అడగండి మా మద్దతు ఉంటుందని చెప్పినట్లు తెలిసింది. ఆ ప్రతిపాదన జిల్లా నాయకత్వం పూర్తిగా తిరస్కరించినట్లు తెలిసింది. ఈ సారి పిరియా సాయిరాజ్ స్థానంలో ఆయన భార్య, జెడ్‌పి చైర్‌పర్సన్ విజయను బరిలో దించడానికి నాయకత్వం సూత్రపాయంగా అంగీకరించినట్లు తెలిసింది.

ఆత్మరక్షణలో టిడిపి

ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా చేసిన రాజకీయ ప్రచారం టిడిపి జిల్లాలోనూ అర్ధాంతరంగా నిలిపివేయాల్సిన పరిస్థితి వచ్చింది. చంద్రబాబుకు రిమాండ్ చెప్పిన తరువాత వెనువెంటనే స్పందించడంలో నేతలు, కార్యకర్తలు జిల్లాలోనూ స్పందించడంలో వెనుకబడ్డారు. వారం తరువాత ఆర్థిక వనరులు రాష్ట్ర పార్టీ నుంచి రావడంతో నిరసన కార్యక్రమాలను ముమ్మరం చేయడం చూశాం. బాబుకు బెయిల్ వస్తుందన్నదానికంటే కేసును కొట్టివేస్తారన్నదానిపై సుదీర్ఘ జాప్యం కావడంతో పచ్చదండులో నీరసం ఆవహించింది. ఇప్పుడు జిల్లాలో బాబు వెంటే నేను కార్యక్రమంలో పోస్టర్లను పంపిణీ చేస్తున్నారు. రాజకీయ కార్యక్రమం కాకుండా బాబు వెంట నేను అన్నది ఆత్మరక్షణ కార్యక్రమంగా ఆ పార్టీ నేతలు భావిస్తున్నట్లు తెలిసింది. ఎప్పుడూ విజన్ గురించి మాట్లాడే బాబు ఇలాంటి సంక్షోభ సమయంలో అవసరమైన ప్రణాళిక టిడిపి వద్ద కొరవడినట్లు స్పష్టమవుతుంది. వారం రోజులుగా ఎలాంటి నిరసన కార్యక్రమాల్లేవు. ఈ నెల 23న పవన్ కళ్యాణతో సమావేశమై కార్యాచరణ రూపొందిస్తారన్న ప్రచారం ఉంది. ఈ నెల 26న వైసిపి ఇచ్ఛాపురం నుంచి బస్సు యాత్ర ప్రారంభించనుంది. దానికి ధీటుగా టిడిపి కార్యక్రమాలు జిల్లాలో ఏ రకంగా ఉంటాయో వేచిచూడాల్సి ఉంది.!

- సత్తారు భాస్కరరావు

పత్రికా ప్రకటన

పాస్ పోర్ట్ పోయింది. శ్రీకాకుళం జిల్లా కవిటి మండలం రాజపురం గ్రామానికి చెందిన **లొట్టి జగదీష్** S/o లొట్టి చలపతి కి చెందిన పాస్ పోర్ట్ నెంబర్ S2633755 రాజపురం గ్రామం నుంచి ఇచ్ఛాపురం బైక్ పై వెళ్తుండగా మార్గమధ్యలో పడిపోయింది. ఎవరికైనా దొరికిన ఎడల లొట్టి జగదీష్‌కు గానీ కవిటి పోలీస్ స్టేషన్లో కానీ అప్పగించాలని విజ్ఞప్తి.

8143091018

పత్రికా ప్రకటన

పాస్ పోర్ట్ పోయింది. శ్రీకాకుళం జిల్లా కవిటి మండలం రాజపురం గ్రామానికి చెందిన **ఆనింగి హేమంతరావు** S/o భగీరథి ఆనింగి కి చెందిన పాస్ పోర్ట్ నెంబర్ R07285200 గ్రామంలో పాత నివాసం నుంచి కొత్త నివాసానికి మారుతుండగా మార్గమధ్యలో పడిపోయింది. ఎవరికైనా దొరికిన ఎడల ఆనింగి హేమంత్‌కు గానీ కవిటి పోలీస్ స్టేషన్లో కానీ అప్పగించాలని విజ్ఞప్తి.

7989350089

దావా సమను
మహారాజశ్రీ చోడవరం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. No. 33 / 2019

బిట్వీన్:
అల్ల అప్పలనరసమ్మ . . . వాది
అండ్:
కర్రి సుబ్బారావు వగైరాలు . . . ప్రతివాదులు
టు:
సనపల పోలినాయుడు, తండ్రి లేటు జగన్నాధం, మేనేజింగ్ పార్టనర్ SPNINFRA Ltd., at సారధి గ్రామం, రాజాం మండలం, R/o. డో.నెం. 50-15-03, టి.పి.టి. కాలనీ, సీతమ్మధార, విశాఖపట్నం. Presently డో.నెం. 16-10-60, ఫజల్‌బేగ్‌పేట, గుజరాతిపేట, శ్రీకాకుళం

అనువార్కి తెలియజేయునది ఏమనగా పై నెంబరు వాది దావా పరిహారములు రాబట్టు నిమిత్తం మీపైని దావా చేసియున్నందున అందు విషయమై మీకు ఎట్టి ఆక్షేపణలున్నచో వాయిదా అగు **తే:31-10-2023దీని ఉదయం 10-30ని॥లకు** పై కోర్టు వారి ఎదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలియపర్చుకొనవలెను. లేనిచో మీ పరోక్షయందు విమర్శించి తీర్మానించడమగును.

ఎస్.బి.శంకరం,
బి.రాజు
చోడవరం పిటిషనర్లు తరపు అడ్వకేట్లు చోడవరం
తే:21-10-23

మాట్లాడుతూ ఎమ్మెల్యే కిరణ్ కుమార్

ప్రజారోగ్యానికి పెద్దపీట

ప్రజాశక్తి- లావేరు

రాష్ట్రంలో ప్రజారోగ్యానికి సిఎం జగన్మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ అన్నారు. శనివారం మండలంలోని గురుగుబిల్లి గ్రామంలో ఉపాధిహామీ నిధులు రూ.17.50 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన వైఎస్ఆర్ విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. అందులో భాగంగానే పిహెచ్‌సిలతో పాటు వైద్య సేవలు ప్రజలకు అందుబాటులో ఉండేందుకు విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేసిందన్నారు. చిన్నచిన్న వ్యాధులకు గ్రామాల్లోనే ఈ క్లినిక్‌ల ద్వారా వైద్య సేవలు ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి రొక్కం బాలకృష్ణ, జెడ్‌పిటిసి మీసాల సీతంనాయుడు, జెసిఎస్ ఇన్‌ఛార్జి మీసాల శ్రీనివాసరావు, సర్పంచ్ బాడిత కల్యాణి, ఎంపిడిఒ కువ్వలి సురేష్‌కుమార్, వైసిపి నాయకులు బాడిత రాంబాబు పాల్గొన్నారు.

నిరసన వ్యక్తం చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఓట్ ఫర్ ఒపిఎస్

ప్రజాశక్తి- సోంపేట

ఉద్యోగ, ఉపాధ్యాయులు పదవి విరమణ తర్వాత హాయిగా జీవితాన్ని గడపాలంటే ఓట్ ఫర్ ఒపిఎస్ అని స్థానిక యుటిఎఫ్ నాయకులు నినదించారు. శనివారం సోంపేటలో జిల్లా యుటిఎఫ్ సహాధ్యక్షుడు బాబూరావు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవితాన్ని పూర్తిగా వృత్తికే అంకితం చేసి చివరి దశలో విశ్రాంత ఉద్యోగులు హాయిగా ఉండేందుకు పెన్షన్ ఎంతో భరోసాగా ఉండాలని గత ప్రభుత్వాలు పాత పెన్షన్ అమలు చేశాయన్నారు. పాత పెన్షన్ అమలు చేయాలని యుటిఎఫ్ పెట్టిన నిరవధిక నిరాహార దీక్షలు ప్రభుత్వం భగ్నం చేయడం అత్యంత అప్రజాస్వామికం, హేయమైన చర్యగా పేర్కొన్నారు. పాత పెన్షన్ అమలు చేయకపోతే ఓట్ ఫర్ ఒపిఎస్ అనే నినాదంతో ప్రజల్లోకి వెళ్లడానికి వెనకాడమన్నారు. కార్యక్రమంలో సోంపేట మండల అధ్యక్షు లు గొరకల దొరబాబు, ఎల్.రవికుమార్, సీనియర్ కార్యకర్తలు పి. హేమచంద్రరావు, జి.ప్రకాష్, ఎస్.కూర్మారావు, పి.కుమారస్వామి, కాళిదాసు, నాగేశ్వరరావు, రుద్రయ్య, కె.గోపి, జి.గోపాల్, తేజోమూర్తి పాల్గొన్నారు.

'ఆరోగ్య సురక్ష'ను వినియోగించుకోవాలి

లావేరు: వైద్యులతో మాట్లాడుతున్న కిరణ్‌కుమార్

ప్రజాశక్తి- లావేరు

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుని ఆరోగ్యంగా ఉండాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే కిరణ్‌కుమార్ అన్నారు. పెద్దలింగాలవలసలో శనివారం ఏర్పాటుచేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. వైద్య శిబిరాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి ఆర్.బాలకృష్ణ, జెడ్‌పిటిసి సీతంనాయుడు, వైస్ ఎంపిపి లుకలాపు శ్రీనివాసరావు, పిఎసిఎస్ అధ్యక్షుడు బూరాడ చిన్నారావు, ఎంపిడిఒ సురేష్‌కుమార్, నాయకులు దేశెట్టి తిరుపతిరావు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి: మండలంలోనిమర్రిపాడు (శి) గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ఎమ్మెల్యే రెడ్డి శాంతి పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ పి.చంద్రకుమారి, డిటి శంకర్రావు, ఎంఇఒ ఎం.పద్మనాభం, ఎంపిపి ప్రతినిధి బి.ఉదయ్ కుమార్, పిఎసిఎస్ అధ్యక్షులు ఉర్లన బాలరాజు, మండల వైసిపి కన్వీనర్ పల్లి యోగి, మాజీ జెడ్‌పిటిసి ప్రతినిధి బమ్మిడి భగేష్, స్థానిక సర్పంచ్ పైల దివ్య, వైద్యాధికారులు హేమంతలక్ష్మి, పావని పాల్గొన్నారు.

కవిటి: గ్రామంలో ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్ పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు పూడి లక్ష్మణరావు, ఎఎంసి వైస్ చైర్మన్ యలమంచి నీలయ్య, సర్పంచ్ కాయ దమయంతి, వైసిపి లీగల్ సెల్ కన్వీనర్ పులకల శ్రీరాములు, మత్స్యకార ఎఫ్‌పిఒ అధ్యక్షుడు కాయ భీమసేన్, నాయకులు ఎర్ని అశోక్, పిన్నింటి జయరాం, మామిడి సంతోష్, ఎంపిడిఒ సూర్యనారాయణ రెడ్డి, వైద్యులు శేఖర్, మౌనిక, అభిమన్యు సోయి పాల్గొన్నారు.

టెక్కలి రూరల్: మండలం తలగాంలో సర్పంచ్‌లు పోలాకి లక్ష్మి, కిల్లి సావిత్రి ఆధ్వర్యంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో దువ్వాడ వాణి పాల్గొన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి పేడాడ రమేష్, సర్పంచ్ ప్రతినిధులు హనుమంతు వెంకటేశ్వరరావు, పోలాకి చంద్రశేఖర్, ఎంపిడిఒ చింతాడ లక్ష్మీబాయి, ప్రజా ప్రతినిధులు, వైద్యసిబ్బంది, సచివాలయ సిబ్బంది గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

నందిగాం: మండలం రధజంబొడ్డపాడు గ్రామంలో సర్పంచ్ బొడ్డపాటి శరేఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్, దువ్వాడ వాణి పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శివప్రసాద్, డిటి ధనలక్ష్మి, వైద్యాధికారులు అనిత, అంజలి, కర్లపూడి సర్పంచ్ తమిరిరాజు, నడిమింటి రామ్మూర్తి పాల్గొన్నారు.

పోలాకి : దండులక్ష్మీపురం పంచాయతీలో జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణ చైతన్య, డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఎంపిపి ప్రతినిధి ముద్దాడ బైరాగి నాయుడు, వైసిపి మండల కన్వీనర్ కణితి కృష్ణారావు, సర్పంచ్ తమ్మినేని వెంకట రత్నం, వైసిపి నాయకులు చింతాడ భీమారావు, చింతు రామారావు, కణితి సత్తిబాబు, త్రినాథరావు, డిటి శ్రీనివాసరావు, ఎంపిడిఒ ఉష, వైద్యులు శ్రీనాథ్, రత్నంరాజు, చందనం, విస్తరణాధికారి రవికుమార్, రామకృష్ణ పాల్గొన్నారు.

సంతబొమ్మాళి: మేఘవరంలో సర్పంచ్ పరపటి సునీత శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్, జెడ్‌పిటిసి పాల వసంతరెడ్డి, ఎంపిటిసి సూరాడ రాజారావు, జిల్లా మత్స్యకార సహకార సంఘం డైరెక్టర్ సూరాడ జోగారావు, మరువాడ వైసిపి ఇన్‌ఛార్జి గంట ఈశ్వరరావు, సచివాలయం కన్వీనర్ పరపటి రవీంద్రనాథ్ రెడ్డి, గంట కుమార్, ఎంపిడిఒ సిహెచ్ ప్రేమలీల, డిటి ప్రవీణ్ కుమార్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.అవని, కార్యదర్శి కె.విద్యా, సచివాలయం సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తలు, వాలంటీర్లు పాల్గొన్నారు.

మెళియాపుట్టి: సీమంతాలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే

వజ్రపుకొత్తూరు: నువ్వలరేవులో నిర్వహించిన జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమంలో ఎంపిపి ఉప్పరపల్లి ఉదయ్ కుమార్ పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎర్రా, వైస్ సర్పంచ్ దేవా, ఎంపిడిఒ ఈశ్వరమ్మ, డిటి గిరి రాజు, వైద్యులు కనిస్క, అంగన్వాడీ కార్యకర్తలు ఇందు, చామంతి, సెక్రెటరీ అదిల్ షా, గ్రామవెన్యూ అధికారి కొమ్మాన హైమవతి పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మండలం విశ్వనాథపురం గ్రామ సచివాలయ ఆవరణలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షుడు రోణంకి ఉమా మల్లేశ్వరరావు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఫణీంద్రకుమార్, డిటి ఆర్.మధు, ఇఒపిఆర్‌డి బొడ్డేపల్లి రామారావు, రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సంపతిరావు హేమసుందరరాజు, నాయకుడు పేడాడ వెంకటరావు, దుంగ శిమ్మన్న సర్పంచ్ ప్రభావతి, ఎంపిటిసి దామోదర్, సింహాచలం, నిమ్మయ్య, కమలాకర్, వైద్యులు, ఏసిడిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

వాడివేడిగా పంచాయతీ సమావేశం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

స్థానిక మేజర్ పంచాయతీ సర్వసభ్య సమావేశం శనివారం వాడివేడిగా జరిగింది. మేజర్ పంచాయతీ సర్వసభ్య సమావేశానికి 20 మంది సభ్యులు ఉండగా 10 మంది హాజరయ్యారు. పంచాయతీ సర్పంచ్ గొండెలి సుజాత అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సర్పంచ్ సోదరులు పెత్తనంపై తీవ్ర స్థాయిలో విమర్శలు వెలువత్తాయి. అధికార వైసిపి వార్డు సభ్యులకు తెలియకుండా పనులు జరుగుతున్నాయిని వార్డు సభ్యులు తోట లోకేశ్వరరావు ఆవేదన వ్యక్తంచేశారు. వార్డు మెంబర్, మాజీ ఇఒ సువార్ రాజేశ్వరరావు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. కనీసం వార్డు మెంబర్లకు చెప్పకుండా పనులు చేయడం, పంచాయతీ నిధులు వినియోగం పట్ల తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వార్డు మెంబర్లను కనీసం పట్టించుకోవడం లేదన్నారు. పంచాయతి నిధులు తీవ్ర స్థాయిలో దుర్వినియోగం అవుతున్నాయని, దీనిపై కమిటీలు వేయాలని సభ్యులు సూచించారు. వారంరోజుల్లో కమిటీ వేస్తామని ఇఒపిఆర్‌డి మల్లేశ్వరరావు తెలిపారు. సమావేశానికి హాజరుకాని వారిపై నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకోవాలని సభ్యులు సూచించారు. సమావేశం వార్డుసభ్యులు కంచరాణ సావిత్రి, నూనెల సోమేశ్వరరావు, దివ్వల పోలయ్య, బమ్మిడి గురువునారడు, దాడి ధర్మారావు, అశోక్, అట్లా రవి, పీత రమణ పాల్గొన్నారు.

నిలదీస్తున్న సభ్యులు

కిడ్నీ వ్యాధితో మహిళ మృతి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

బైపల్లి గ్రామానికి చెందిన కోడ విజయలక్ష్మి (48) కిడ్నీ వ్యాధితో శుక్రవారం రాత్రి మృతి చెందినట్లు ఆమె భర్త జగదీష్ శనివారం తెలిపారు. మృతురాలు గత కొన్నేళ్లుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతుంది. పలాస ప్రభుత్వ ఆస్పత్రిలో డయాలసిస్ సేవలు పొందుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతిరాలికి కుమారుడు ఉన్నాడు.

విజయలక్ష్మి (ఫైల్)

సంతబొమ్మాళి : ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజాప్రతినిధులు

భూ హక్కుపై అవగాహన

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

మండలం పాలతలగాంలో సర్పంచ్ నక్కిల్ల అప్పన్న, ఎంపిటిసి అట్టాడ అప్పలనాయుడు ఆధ్వర్యంలో జగనన్న భూ హక్కు, భూ రక్షా కార్యక్రమం శనివారం నిర్వహించారు. జగనన్న భూహక్కు, భూరక్ష పథకంలో గ్రామ కంఠం పరిధిలో ఉన్న గృహలకు రికార్డ్ ఆఫ్ రైట్స్ కింద పూర్తి హక్కులు కల్పిస్తూ హక్కు పత్రాలు జారీ చేయటంపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజేంద్ర ప్రసాద్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

టెక్కలి: రైతుల భూములు పరిరక్షణలో భాగంగా ప్రభుత్వం ఆదరిస్తున్న జగనన్న భూ హక్కు పథకంపై రైతులకు, ప్రజలకు అవగాహన ఆవసరమని పెద్దరోక్కపల్లి సర్పంచ్ రాంపాత్రుని ఆశాప ఉన్నారు. పథకంపై శనివారం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలపై అవగాహన కల్పించుకోవాలన్నారు. కార్యక్ర మంలో గ్రామ సచివాలయ కార్యదర్శి పేడాడ సోమేశ్వరరావు, కార్యదర్శి పల్లి ఉమామహేశ్వరరావు, పీల్డ్ అసిస్టెంట్ పి.మల్లేశ్వరరావు, వాలంటీర్లు, ఆంగన్‌వాడీ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

నేడు హిందీమంచ్ సమావేశం

రణస్థలం రూరల్: హిందీ మంచ్ జిల్లాశాఖ సమావేశం ఆదివారం 10:30 గంటలకి జిల్లా కేంద్రంలో జిల్లా పరిషత్తు ఎదురుగా ఉన్న కొత్త ఎపిహెచ్‌బి కాలనీలోని విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘ భవనంలో జరగనున్నట్టు హిందీ మంచ్ ప్రధాన కార్యదర్శి రొంపివలస రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి విశ్రాంత జిల్లా విద్యాశాఖాధికారి బలివాడ మల్లేశ్వరరావు, విశాఖపట్నంకు చెందిన గణిత ఉపాధ్యాయులు డి.శ్యామల, వరిష్ఠ ఉపాధ్యాయ సంఘ నేత ఎం.నీలాద్రిరావు, హింది మంచ్ ఉత్తరాంధ్ర కన్వీనర్ కోనే శ్రీధర్‌లు పాల్గొంటారని తెలిపారు. హిందీ భాషాభిమానులందరూ పాల్గొనాలని కోరారు.

పంట పొలాలను పరిశీలిస్తున్న అజయ్

కరువు మండలంగా ప్రకటించాలి

నందిగాం: నందిగామ మండలం వర్షాభావ పరిస్థితుల మూలంగా పూర్తిగా పంటలు ఎండిపోయి రైతులు నష్టాన్ని చవిచూస్తున్నారని దీనిని దృష్టిలో పెట్టుకొని నందిగాం మండలాన్ని కరువు మండలంగా ప్రకటించకపోతే ఆందోళన చేస్తామని టిడిపి మండల అధ్యక్షుడు పినకాన అజయ్ కుమార్ అన్నారు. శనివారం మండలంలోని మదనాపురం, కలవాడ తదితర గ్రామాలను పరిశీలించి రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. రైతులు అష్టకష్టాలు పడి పంట పెట్టుబడి పెడితే వర్షాలు లేకపోవడంతో పంటలు దెబ్బతిని తీవ్రంగా నష్టపోయామని, రైతులకు ఎదురైన నష్టాన్ని గుర్తించి ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. బిసి సెల్ రాష్ట్ర ప్రతినిధి ఎం.బాలకృష్ణ, టిడిపి నాయకులు జానకిరామ్, లోకనాథం, తిరుపతిరావు, కృష్ణారావు, మోహనరావు, పున్నయ్య ఉన్నారు.

మాట్లాడుతున్న తహశీల్దార్ శేఖర్

25న జగనన్నకు చెబుదాం

ప్రజాశక్తి- కవిటి

స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఈనెల 25న జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తహశీల్దార్ పి.శేఖర్, ఎంపిడిఒ పి.సూర్యనారాయణ రెడ్డి తెలిపారు. శనివారం మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్, ఎస్‌పితో పాటు జిల్లా ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొని వినతులు స్వీకరిస్తారని, స్థానికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఎస్ఐ కె.రాము, ఎంఇఒ ధనుంజయ, ఇఒపిఆర్‌డి శివాజీ పానిగ్రాహి, మండల ఇంజనీర్ ప్రవీణ్ కుమార్, ఎపిఒ గోవిందరావు, హౌసింగ్ ఎఇ సాయికిరణ్ పాల్గొన్నారు.

భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దు

ప్రజాశక్తి- పొందూరు

ప్రతిఒక్కరూ చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఉపహార్ స్వచ్ఛంద సంస్థ నేషనల్ డైరెక్టర్ డా.రంజిత్ కుమార్ పానీ అన్నారు. మండలం లోలుగు ఉపహార్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం యూత్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో కొంతమంది యువకులు చెడు వ్యసనాలకు బానిసై తమ బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో ఉపహార్ సంస్థ ఏరియా మేనేజర్ బి.ఎం.పాల్, కో-ఆర్డినేటర్ ఏసుదాసు, కమ్యూనిటీ ఫెసిలిటేటర్ లోపింటి అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న యువకులు

అయోడిన్ ఉప్పునే వాడాలి

డిఎంహెచ్ఒ డాక్టర్ మీనాక్షి

జెండా ఊపి ర్యానిని ప్రారంభిస్తున్న డిఎంహెచ్ఒ మీనాక్షి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఆరోగ్యంగా జీవించేందుకు ప్రతిఒక్కరూ అయోడిన్ ఉప్పునే వినియోగించా లని జిల్లా వైద్యా ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి పేర్కొన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో అయోడిన్ వారోత్స వాల్లో భాగంగా శనివారం ర్యాలీ నిర్వహించారు. ముందుగా ఈ ర్యాలీని జెండా ఊపి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అయోడిన్ ఉప్పు వాడటం వల్ల పిల్లల్లో మెదడు అభివృద్ధి చెందుతుందని అన్నారు. జీవక్రియను క్రమబద్ధీకరిస్తుందన్నారు. అయోడిన్ లోపం ఉన్నట్టయితే ఈ ఉప్పు వాడటం వల్ల గోయిటర్ వ్యాధులు రాకుండా కాపాడుతుందన్నారు. గరిష్టశక్తి స్థాయిలను కలిగి ఉంటారని అన్నారు. వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. పిల్లల్లో శారీరక, మానసిక వృద్ధికి తోడ్పడుతుందని చెప్పారు. అయోడిన్ ఉప్పు వాడకపోతే హైపర్ థైరాయిడ్ వ్యాధి సంక్రమించి ఆందోళన, నిద్రలేకపోవడం, అధిక చెమట, అతి ఆకలి, బరువు తగ్గటం, హైపో థైరాయిడ్ వల్ల అలసట, జుట్టు రాలిపోవడం, చలిని తట్టుకోలేకపోవడం, బరువు పెరగడం, రుతుస్రవనం సకాలంలో రాకపోవడం వంటి ఇబ్బందులు వస్తాయన్నారు. అందువల్ల ప్రతిఒక్కరూ అయోడిన్ ఉప్పును వాడాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు డిఎంహెచ్ఒ డాక్టర్ ఎన్.అనురాధ, డిఐఒ డాక్టర్ ఈశ్వరీదేవి, డాక్టర్ సి.పి.శ్రీదేవి, జిల్లా మాస్ మీడియా అధికారి పైడి వెంకటరమణ, డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ సుజాత, రవికుమార్, అప్పారావు, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

పింఛన్ల అవకతవకలపై విచారణ

పొందూరు: మండలం గోరింట గ్రామంలో అనర్హులకు పింఛన్లు మంజూరు చేసినట్లు సర్పంచ్ ప్రతినిధి, టిడిపి బిసిసెల్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి, గోరింట మాజీ సర్పంచ్ చింతాడ కృష్ణవాసుదేవరావు జిల్లా కేంద్రంలో స్పందనలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు జెసి ఆదేశాలతో శనివారం గోరింట సచివాలయంలో ఎంపిడిఒ సీపాన హరి హరరావు విచారణ చేపట్టారు. ఆధార్‌కార్డులో వయస్సును ట్యాంపర్ చేసి 60ఏళ్ళకు తక్కువగా ఉన్నవారికి పింఛన్లు అందించడంపై స్పందనకు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. దీంతో జెసి నవీన్ కుమార్ ఆదేశాల మేరకు ఎంపిడిఒ సీపాన హరిహరరావు, ఇఒపిఆర్‌డి సింహాచలం, సర్పంచ్ చింతాడ శ్రీలక్ష్మి, ఫిర్యాదుదారుడు చింతాడ కృష్ణవాసుదేవ రావుల సమక్షంలో పింఛను పొందుతున్న వారిని విచారణ జరిపారు. వారి ఆధార్ కార్డులను పరిశీ లించారు. ఈ విచారణపై సమగ్ర నివేదికను కల ెక్టర్‌కు అందజేయనున్నట్లు వారు పేర్కొన్నారు.

విచారణ చేస్తున్న అధికారులు

మందును అందజేస్తున్న ప్రకాష్‌కుమార్

శాస్త్రీయ పద్ధతులు అవసరం

ఆమదాలవలస : పాడి పశువుల పోషణలో శాస్త్రీయ పద్ధతులను అవలంబిస్తే అధిక పాల దిగుబడి సాధించవచ్చునని పశువైద్య విశ్వవిద్యాలయాధికారి డాక్టర్ బి.ప్రకాష్‌కుమార్ అన్నారు. శనివారం జొన్నవలస గ్రామంలో పశు సంవర్ధక పాలిటెక్నిక్ విద్యార్థులు అవగాహన కొరకు ఏర్పాటు చేసిన పశువైద్య శిబిరాన్ని సర్పంచ్ ప్రతినిధి గొంటి కృష్ణ ప్రారంభించారు. విద్యార్థులకు పశువుల పెంపకం, పాడి రైతులకు పాడి పరిశ్రమను ఎలా వృద్ధి చేయాలో డాక్టర్ బి. ప్రకాష్ కుమార్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమ ఇన్‌ఛార్జి, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ సిహెచ్ సుబ్రహ్మణ్యం, స్థానిక పశు వైద్యురాలు బి.హేమలత రైతులకు, విద్యార్థులకు ఎన్ఎస్ఎస్ సేవా కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో 56 పశువులకు గర్భోత్పత్తి సమస్యలకు, 30 లేగ దూడలకు ఏలిక పాముల మందును పట్టించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఎస్.గంగునాయుడు, విద్యార్థులు, పాడి రైతులు పాల్గొన్నారు.

ఓపెన్ టెన్త్ పరీక్షా కేంద్రం ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఓపెన్ టెన్త్ పరీక్షా కేంద్రం ఇచ్ఛాపురంలో మంజూరు చేయాలని మాజీ ఎమ్మెల్యే సాయిరాజు, ఎమ్మెల్సీ రామారావుకు నాయకులు వినతిపత్రం అందించారు. గతంలో ఐదు సంవత్సరాలు ఇచ్ఛాపురం కేంద్రంగా ఉన్న ఓపెన్ టెన్త్ కేంద్రం టెక్కలికి మార్చడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. దూర ప్రాంతాల నుండి వచ్చేవాళ్లు రెండు, మూడు బస్సులు మారాల్సి వస్తుందని, దీనివలన పరీక్షకు వెళ్లే వారు హాజరు కాలేకపోతున్నారన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ఇచ్ఛాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రం మంజూరు చేయాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో మున్సిపల్ ఛైర్పర్సన్ రాజ్యలక్ష్మి, ఆరోవార్డు ప్రతినిధి పి.కోటి, వార్డు కౌన్సిలర్ తాడి ఆదిరెడ్డి, రాంజీ, ప్రేమ కుమార్, ప్రత్తి అన్వేష్, బత్తుల రామారావు నాయకులు ఉన్నారు.

వినతిపత్రం అందిస్తున్న ప్రజాప్రతినిధులు

పాముకాటు మృతి ఘటనపై విచారణ

విచారణ చేస్తున్న వైద్యాధికారి శ్రీనుబాబు

పొందూరు: మండల కేంద్రంలో సామాజిక ఆస్పత్రిలో గత నెల 16న పాముకాటు బాధితునికి వైద్యం అందించడంలో నిర్లక్ష్యం వలన మృతి చెందిన ఘటనపై డిసిహెచ్ఒ జె.భాస్కరరావు ఆదేశాల మేరకు శనివారం స్థానిక సామాజిక ఆస్పత్రిలో నరసన్నపేటకు చెందిన సామాజిక ఆస్పత్రి సివిల్ సర్జన్ శ్రీనుబాబు శాఖాపరమైన విచారణ నిర్వహించారు. బాధిత కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గత నెల 16న జి. సిగడాం మండలం చెట్టుపొదిలాం గ్రామానికి చెందిన కొల్లి నారాయణరావు(55)కు పాముకాటు వేసింది. కుటుంబసభ్యులు బాధితుడిని పొందూరు సామాజిక ఆసుపత్రికి తీసుకువచ్చారు. ఆస్పత్రిలో గంటసేపు సాధారణ వైద్యం అందించిన సిబ్బంది కనీసం పాముకాటుకు వేసే యాంటీ వీనం ఇంజక్షను వేయకుండా పంపించివేయడంతో శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించగా అదే రాత్రి మృతిచెందాడు. దీంతో సిబ్బంది నిర్లక్ష్యంపై మృతుని బంధువులు శ్రీకాకుళం ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై డిసిహెచ్ఒ భాస్కరరావు ప్రాథమిక విచారణ జరిపగా ఈ విచారణలో సిబ్బంది నిర్లక్ష్యాన్ని గుర్తించడంతో పాటు గతంలోను ఇటువంటి నిర్లక్ష్య ఘటనలు వెలుగులోకి రావడంతో ఆయన శాఖాపరమైన విచారణకు ఆదేశించారు. అందులో భాగంగా శనివారం సివిల్ సర్జన్ శ్రీనుబాబు సమగ్ర విచారణ జరిపారు. సంఘటన సమయంలో ఉన్న సిబ్బందిని మృతుని బంధువుల సమక్షంలో వారి ఆరోపణలపైనా, సిబ్బంది, ఆస్పత్రిపై వస్తున్న ఇతర ఆరోపణలపై విచారణ జరిపి మృతుని బంధువుల నుంచి లిఖితపూర్వకంగా స్టేట్మెంట్ తీసుకున్నారు. విచారణ నివేదికను జిల్లా కలెక్టర్‌కు, వైద్యశాఖ ఉన్నతాధికారులకు పంపిస్తున్నట్లు చెప్పారు. ఈ విచారణలో ఆస్పత్రి సూపరింటెండెంట్ రామదాసు, వైద్యులు సుజాత, ప్రతిభ, ఆస్పత్రి సిబ్బంది ఉన్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరించవద్దు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

త్యాగాల పునాదులపైన నిర్మించిన విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రయివేటుపరం చేయడానికి కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడం, ఉత్తరాంధ్రను ఏకంగా ఇతరులకు అమ్మకానికి పెట్టడమేనని వివిధ పార్టీల, ప్రజా సంఘాల ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు. నగరంలోని క్రాంతి భవన్‌లో శనివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. వైసిపి, కాంగ్రెస్, బిజెపి మినహా అన్ని పార్టీలు, ప్రజాసంఘాల ప్రతినిధులు పాల్గొని మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో 32 మంది విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనే నినాదంతో జరిగిన ఉద్యమంలో ప్రాణాల కోల్పోయారని చెప్పారు. కాంగ్రెసు మినహా, దాదాపు అన్ని పార్టీల వారు చట్టసభల పదవులకు రాజీనామా చేశారని గుర్తు చేశారు. వేలాదిమంది ఇళ్లను, భూములను స్టీల్ ప్లాంట్‌కు స్వచ్ఛందంగా అప్పగించారని చెప్పారు. బలిదానాలకు, త్యాగాలకు విలువ ఇవ్వకుండా మోడీ ప్రభుత్వం తన కొమ్ము కాసే కార్పొరేట్ కంపెనీల కోసం స్టీల్ ప్లాంట్ అమ్మకానికి ప్రయత్నించడం జాతి ప్రయోజనాలను బలి తీసుకోవడమేనని విమర్శించారు. అఖిలభారత యువజన సమాఖ్య, శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి గుండ అప్పల సూర్యనారాయణ, సిపిఐ జిల్లా కార్యదర్శి బలగ శ్రీరామ్మూర్తి, అరసం జిల్లా అధ్యక్షులు నల్లి ధర్మారావు, రైతు సంఘం నాయకులు బుడితి అప్పలనాయుడు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అప్పలసూర్యనారాయణ

26న బస్సుయాత్ర

ప్రజాశక్తి- కవిటి

ఈ నెల 26న ఇచ్ఛాపురంలో జరగబోయే సామాజిక సాధికార యాత్ర విజయవంతం చేయాలని ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్ కోరారు. శనివారం నెలవంక గ్రామంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు పాల్గొని, కార్యకర్తలు, స్థానికులు పాల్గొనేలా చూడాలన్నారు. మండలం నుంచి అత్యధిక మంది పాల్గొని సిఎం జగన్మోహన్ రెడ్డికి మద్దతు తెలపాలన్నారు. సమావేశంలో సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు పూడి లక్ష్మణరావు, ఎఎంసి చైర్మన్ దువ్వు కృష్ణారెడ్డి, ఎఎంసి వైస్ చైర్మన్ వై.నీలయ్య, నెలవంక సర్పంచ్ ప్రతినిధి దుర్గాశి కుమార్ మోహన్ రెడ్డి, వైసిపి లీగల్ సెల్ కన్వీనర్ పులకల శ్రీరాములు, మామిడి సంతోష్ పాల్గొన్నారు.

జగన్‌ను నమ్మే పరిస్థితిలో జనం లేరు

పోస్టర్లను అందజేస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజా సమస్యలను గాలికి వదిలివేసి ప్రతిపక్ష నాయకులపై కక్ష్య సాధింపుతో కేసులు పెడుతూ రాష్ట్ర అభివృద్ధిని వదిలివేశారని, రాష్ట్ర ప్రజలు జగన్‌ను నమ్మే స్థితిలో లేరని మాజీ ఎంపిపిలు తర్ర రామకృష్ణ, కామేశ్వరరావుల అన్నారు. శనివారం మండలంలో తర్లిపేట పంచాయతీలో మండల టిడిపి నాయకులంతా కలిసి బాబుతో నేను కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ సిఎం చంద్రబాబుపై అక్రమ కేసులు బనాయించి జైల్లో కనీస సౌకర్యాలు కల్పించకుండా ఇబ్బందులు గురిచేయడం చాలా బాధాకరమైన చర్యని వారు మండి పడ్డారు.

చంద్రబాబు నాయుడు అనారోగ్యంగా దెబ్బతీసేందుకే జగన్‌మోహన్‌రెడ్డి కుట్ర చేస్తున్నారన్నారు. దీర్ఘకాలిక చర్మ సమస్య వలన వేడినీళ్లు అందించాలని ప్రభుత్వాన్ని అడిగినా పట్టించుకోరా అని మండి పడ్డారు. ఈ కార్యక్రమంలో టెక్కలి మండల పార్టీ అధ్యక్షుడు బగాది శేషు, రెడ్డి అప్పన్న, ఎస్,శ్రీనివాసరావు, గొండు లక్ష్మణరావు, కర్రి అప్పారావు, శిమ్మ సింహాచలం, వాన లక్ష్మి, కొర్రాయి మల్లేసు, పైల తవిటయ్య, కోరాడ గోవిందరావు, శిమ్మ నారాయణరావు, సర్పంచ్ ఓడరేవు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పెరుగుతున్న సెల్ దొంగతనాలు

ప్రజాశక్తి- పలాస

ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై రోడ్డుపైకి వస్తారు. అందులో ఒక వ్యక్తి 20 అడుగుల దూరంలో నిలబడి గమనిస్తుంటాడు. మరో వ్యక్తి రోడ్డుపై వాహనం పడిపోతున్నట్లు నటిస్తాడు. దూరంలో ఉన్న వ్యక్తిని కాపాడాలని కోరుతాడు. ఇంతలో మానవతావాదులు వారిని ఎత్తే ప్రయత్నం చేస్తారు. ఇంతలో నిలబడిన వ్యక్తి కూడా వచ్చి వారితో కలిసి వాహనం పైకి లేపుతాడు. తరువాత ఇంటికి వెళ్లి ఆ మానవతావాదులు జేబులుగాని, తాము పార్కింగ్ చేసిన వాహనంలోగాని సెల్‌ఫోన్ ఉంటే మరి కనిపించదు. ఆ ఇద్దరు అగంతులకు చిక్కిపోతుందంతే. ఇక తరువాత కథ మామూలే... సరిగ్గా ఇటువంటి సంఘటనే తాజాగా శనివారం ఉదయం నిత్యం బిజీగా ఉండే కెటిరోడ్డు ఆంజనేయ మందిరం వద్ద చోటుచేసుకుంది. జీడి వ్యాపారవేత్త మల్లా రామేశ్వరరావు రెండు రోజుల క్రితం ఎంతో ఇష్టంతో రూ.60 వేలు ఇచ్చి ఓ ఖరీదైన సెల్‌ఫోన్ కొనుగోలు చేసారు. ఉదయం 9.30 గంటల ప్రాంతంలో పనిమీద ఇంటికి వెళ్లడానికి తన గడప ముందే ద్విచక్ర వాహనాన్ని పార్కింగ్ చేసి లోపలకు వెళ్లాడు. ఈ క్రమంలో ఆయన సెల్‌ఫోన్ వాహనంపైన పెట్టి గడపవద్దకు వెళ్లేసరికి ఒక వ్యక్తి ద్విచక్రవాహనం పడిపోతున్నట్లు నటించాడు. మరోవ్యక్తి పడిపోతున్నాడని కేకలు వేయడంతో రామేశ్వరరావు ఆయనను పైకి లేపేందుకు ప్రయత్నించగా కేకలు వేసిన వ్యక్తి కూడా వచ్చి ఆయనను పైకి ఎత్తారు. ఈ క్రమంలో రామేశ్వర రావుకు చెందిన సెల్‌ఫోన్ ద్విచక్రవాహనంపైన కనిపించలేదు. వారిపై అనుమానంతో ప్రశ్నించే సరికి పలాయనం చిత్తగించారు. దీనికి సంబంధించిన వీడియో పొరుగునే ఉన్న ఓషాపులో ఉన్న సిసి కెమేరాలో నిర్లిప్తమయ్యాయి. అందులో ఇద్దరు దొంగలు ఏ విధంగా వచ్చింది, వారు ఏ విధంగా దొంగతనం చేసారో స్పష్టంగా ఉంది. ఇదిలా ఉం డగా ఇటువంటి దొంగతనాలు మూడు నెలల వ్యవధిలో మొత్తం నాలుగు ఒక్క పలాస కాశీబుగ్గ జంట పట్టణాల్లోనే జరిగాయి. ఆ ఇద్దరు వ్యక్తుల వయసు 30 నుంచి 35 సంవత్సరాల వయసు మధ్య ఉంటుందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఇటువంటి దొంగతనాలకు సంబంధించి జిల్లా పోలీసు యంత్రాంగం పటిష్ఠంగా చర్యలు తీసుకోవడానికి యాప్‌ను ప్రవేశపెట్టింది. అందులో రామేశ్వరరావు సెల్‌ఫోన్‌కు సంబంధించి చోరీని ఫిర్యాదు చేసారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. తరచూ జరుగుతున్న సెల్‌దొంగతనాలపై గట్టి నిఘా పెట్టి వారి ఆగడాలకు పులిస్టాప్ చెప్పాలని బాధితులు కోరుతున్నారు.

దువ్వాడ వాణిని సన్మానిస్తున్న చిట్టివలస ప్రజలు

వాణికి సన్మానం

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

మండలం చిట్టివలస పంచాయతీలో ఎన్నో ఏళ్లుగా రహదారికి నోచుకోకపోవడంతో ఈ పంచాయతీ ప్రజలు నానా అవస్థలు పడ్డారు. సర్పంచ్ సంపతిరావు వెంకటరమణ ఈ విషయం ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, టెక్కలి నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త దువ్వాడ వాణిల దృష్టికి తీసుకువెళ్లటంతో వారు సిఎం జగన్‌మోహన్‌రెడ్డికి తెలియజేసి రూ.కోటి 29లక్షలతో జాతీయ రహదారి సుబ్బారావుపేట నుంచి చవితిపేట వరకు సిసి, బిటి రోడ్డు, చవితిపేట జంక్షన్ నుంచి భగీరధపురం మీదుగా నిమ్మాడవరకు రూ.కోటి 20లక్షలు, అలాగే తులసిపేట నుంచి చిట్టివలస గ్రామం వరకు రూ.80లక్షలతో రోడ్లు నిర్మాణానికి నిధులు మంజూరు చేసి, రోడ్లు నిర్మాణం చేయటంతో ఆయా గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. శనివారం టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణికి చిట్టివలస పంచాయతీ ప్రజలు ఘనంగా సన్మానించారు.

రెడ్డి సంఘ భవనానికి విరాళం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

శ్రీకాకుళంలో కొత్తగా నిర్మిస్తున్న రెడ్డి సంఘం భవనానికి ఇచ్ఛాపురం మున్సిపల్ ఛైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి రూ. లక్ష విరాళం అందించారు. శనివారం రెడ్డి సంఘం నేతలకు విరాళం అందించారు. ఈ కార్యక్రమంలో దుక్కా లోకేశ్వరరావు, ఉప్పాడ రాజారెడ్డి, పిలక యాదవ రెడ్డి ఉన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణదాస్

చక్రధర్ లేని లోటు పూడ్చలేనిది

ప్రజాశక్తి- పోలాకి

మండలం జడూరు గ్రామంలో జిల్లా పరిషత్ మాజీ సిఇఒ గొండు చక్రధరబాబు 3వ వర్ధంతి సందర్భంగా శనివారం జడూరు గ్రామంలో ఏర్పాటు చేసిన విగ్రహావిష్కరణ కార్యక్రమంలో మాజీ ఉప ముఖ్యమంత్రి, జిల్లా పార్టీ అధ్యక్షులు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలం నుండి అతిచిన్న వయస్సులోనే జిల్లా పరిషత్ సిఇఒగా ఉద్యోగం రావడం సంతోషించామని, ఎంత కాలం నిలవకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో ధర్మాన రామలింగం నాయుడు, డిసిసిబి ఛైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఎంపిపి ముద్దాడ దమయంతి, బైరాగి నాయుడు, గొండు విశ్వనాథం, నరసన్నపేట ఎంపిపి ఆరంగి మురళీధర్, సుడా ఛైర్మన్ కోరాడ చంద్రభూషణ గుప్త, పొందర కార్పొరేషన్ ఛైర్మన్ రాజాపు హైమావతి అప్పన్న, మండల పార్టీ అధ్యక్షులు కణితి తౌడు, జెసిఎస్ కన్వీనర్ సురంగి నర్సింగరావు పాల్గొన్నారు.

అన్నసంతర్పణ

రణస్థలం రూరల్: మండల కేంద్రం జెఆర్.పురంలో దుర్గాదేవి నవరాత్రి వేడుకలు సందర్భంగా ఉత్సవ కమిటీ శనివారం ఏర్పాటు చేసిన అన్న సమారాధన కార్యమానికి స్థానిక ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ హాజరై అన్నసంతర్పణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ భవిరి రమణ, ఎంపిటిసి ప్రతినిధి సాయి, ఉత్సవ కమిటీ సభ్యులు బలివాడ శ్రీనివాసరావు, వరప్రసాద్, టెకే బ్రహ్మజీ, పాల్గొన్నారు.

లావేరు: మండలంలో నేతేరు గ్రామంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

రైళ్లను నిలుపుదల చేయాలి

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

జాతీయ రహదారికి అనుకొని నాలుగు మండలాల ప్రజలకు అందుబాటులో ఉన్న హరి శ్చంద్రపురం రైల్వేస్టేషన్‌లో గుణుపూర్ పాసింజర్, విశాఖ ఎక్స్‌ప్రెస్ రైళ్ల నిలిపేందుకు చర్యలు తీసుకోవాలని బిజెపి రాజ్యసభ సభ్యులు జివిఎల్ నరసింహారావుకు శనివారం శ్రీకాకుళం జిల్లాకు వచ్చిన ఆయనకు బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు మెట్ట తిరుపతిరావు వినతిపత్రం అందజేశారు. మండల పరిధిలో హరిశ్చంద్రపురం రైల్వేస్టేషన్ ద్వారా టెక్కలి, కోటబొమ్మాళి, నరసన్నపేట, సారవకోట మండ లాలకు చెందిన 100 గ్రామాల నుంచి ప్రతిరోజు వేలాది మంది ప్రజలు రైలు మార్గం గుండా ప్రయాణం చేస్తారని, ఈ స్టేషన్ జాతీయ రహదారికి అనుకొని ఉన్నందున ప్రయాణికులు ఈ స్టేషన్‌కు సులువుగా చేరు కోవచ్చన్నారు. గతంలో పలువురు రైల్వే అధికారులు ఈ స్టేషన్‌ను పరిశీలించి ఈ రైళ్ల నిలుపుటకు హామీ

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఇచ్చినప్పటికీ ఇప్పటి వరకు హామీ అమలు కాలేదని వినతిపత్రంలో పేర్కొన్నారు. అలాగే స్టేషన్‌లో ఫ్లైవర్ బ్రిడ్జి లేనందున ఒక ప్లాట్ ఫారం నుంచి మరో ప్లాట్ ఫారంకు వెళ్లేందుకు ప్రయాణికులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఈ విషయాన్ని దృష్టిలో పెట్టికొని రైల్వేమంత్రితో చర్చించి గుణుపూర్, విశాఖ రైళ్ల నిలుపుదలచేసి, ఫ్లైవర్ బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేయాలని కోరారు. ఈయనతో పాటు బిజెపి నాయకులు పూడి తిరుపతిరావు, ఉప్పాడ శ్యామలరావు ఉన్నారు.

శ్రీకాకుళం అర్బన్: ఉత్తరాంధ్రా అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని బిజెపి రాజ్యసభ సభ్యులు జి.వి.ఎల్ నరసింహారావు డిమాండ్ చేశారు. జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన నగరంలోని ఓ హోటల్‌లో శనివారం విలేకరులతో మాట్లాడారు. విశాఖను రాజధానిగా డిక్లేర్ చేసే అధికారం ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి లేదని అన్నారు. వేల సంఖ్యలో మత్స్యకారులు ఈ ప్రాంతం నుంచి ఇతర ప్రాంతాలకు వలస వెళ్తూ జీవిస్తున్నారని అన్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన రంగాలను అభివృద్ధిలో భాగస్వామ్యం చేస్తున్నామని చెప్పారు. బిజెపి యాక్షన్ ఉత్తరాంధ్ర అనే ప్రణాళికను సిద్ధం చేసి అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోందన్నారు. అందులో భాగంగా విశాఖను కేంద్ర ప్రభుత్వం గ్రోత్ హబ్‌గా ఎంపిక చేసిందన్నారు. ముందుగా అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయాన్ని సందర్శించారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు బిర్లంగి ఉమామహేశ్వరరావు, పైడి వేణుగోపాలం, పూడి తిరుపతిరావు, ఎంబిజి నాయుడు, చల్లా వెంకటేశ్వరరావు ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

సంతోష్‌కు చెక్కును అందజేస్తున్న జనసేన నాయకులు

జనసేన ఆర్థికసాయం

ప్రజాశక్తి- ఆమదాలవలస

మున్సిపాలిటీలో 8వ వార్డు పరిధిలో లెప్రసీ కాలనీలో నివాసం ఉంటున్న నూరు సంతోష్ కుటుంబానికి జనసేన నాయకులు ఆర్థిక తోడ్పాటును అందించారు. వివరాల్లోకి వెళ్తే నూరు సంతోష్ తల్లి 16నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయాలపాలై కోమాలోకి వెళ్లిపోయి నేటికీ కోలుకోకపోవడంతో ఆ కుటుంబానికి శనివారం జనసేన నాయకులు కొత్తకోట నాగేంద్ర, కోరుకొండ మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో రూ.25 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు మాట్లాడుతూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న ఆ కుటుంబానికి తమవంతు ఆర్థిక సహాయాన్ని అందజేసినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరు తోచినంత సహాయాన్ని ఆ కుటుంబానికి అందజేసి అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి సిక్కోలు విక్రమ్, పైడి మురళీమోహన్, బాలమురళి, అనుష్, చందు మనోహర్, జిమ్ శంకర్, సిపాన రమేష్ పాల్గొన్నారు.

రూ.14లక్షలతో శ్మశానవాటిక రోడ్డు

ప్రజాశక్తి- బూర్జ

మండలం పెద్దపేట సచివాలయం పరిధి నీలాపురం గ్రామ ప్రజల దశాబ్దాల కోరిక నెరవేరిందని గ్రామస్తులు తెలిపారు. నీలాపురం గ్రామం నుండి స్మశాన వాటికకు 450 మీటర్లు, రూ.12 లక్షల నిధులతో సీసీ రోడ్డు నిర్మించారు. శనివారం ఉప సర్పంచ్ దుప్పాడ వెంకట అప్పలనాయుడు, పిఎసిఎస్ డైరెక్టర్ వి. గోవిందరావు బోరుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో గ్రామంలో ఎవరైనా చనిపోతే పొలం గట్టుపై నుంచి వెళ్లే పరిస్థితి ఉండేదని, స్పీకర్ తమ్మినేని సీతారాం స్పందించి ఈ గ్రామానికి రహదారి నిర్మించారన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ను గౌరునాయుడు, దుప్పాడ సిమ్మినాయుడు, గ్రామస్తులు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న స్పీకర్ సీతారాం

దళితుల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి- ఆమదాలవలస

దళితుల అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని మెట్టక్కివలసలో రూ.23 లక్షలతో ఎస్‌సి కమ్యూనిటీ హాల్ భవనానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత సామాజికవర్గం అభ్యున్నతికి సిఎం జగన్మోహన్ రెడ్డి కృషి చేస్తున్నా రన్నారు. రాజకీయ సాధికారితలో భాగంగా ప్రణాళిక బద్ధంగా సిఎం అడుగులు వేస్తున్నారన్నారు. దళితులు వైసిపికి ఆత్మ బంధువులన్నారు. దళిత సామాజికవర్గం నిర్ణయాత్మక శక్తిగా ఎదగాలన్నదే సిఎం అభిలాషన్నారు. దళితులను అన్ని రంగాల్లో ముందుకు తీసుకు వెళ్ళేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కృషి చేస్తున్నార న్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.రవి సుధాకర్, వైసిపి నాయకులు బొడ్డేపల్లి రమేష్ కుమార్, అల్లం శెట్టి ఉమా మహేశ్వరరావు, బోర చిన్నంనాయుడు, దుంపల శ్యామల రావు, చిరంజీవి, కూన రామకృష్ణ, సాదు చిరంజీవి, సంపదరావు రామారావు, సచివాలయ ఉద్యోగులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

విజయావకాశాలపై ప్రత్యేక శ్రద్ధ

టెక్కలి: విద్యార్థులు పోటీ ప్రపంచాన్ని తట్టుకునేందుకు కావల్సిన విజయావకాశాలపై దృష్టి పెట్టాలని గ్రంథాలయాధికారిణి బి.రూపావతి అన్నారు. దసరా సెలవుల శిబిరంలో భాగంగా నిర్వహించిన వివిధ రకాల పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులను శని వారం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లక్ష్యం వైపు గమనం ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయు లు ఎల్ .మోహనరావు, గ్రంథాలయ సహాయకురాలు ఎస్. ఆమ్మునమ్మ, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

లావేరు: ప్రతి విద్యార్థి నీతి కథలు నేర్చుకోవాలని గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు అన్నారు. అలాగే గ్రంథాలయంలో ఉన్న స్వతంత్ర సమరయోధులు, గ్రంథా లయ ఉద్యమకారుల చరిత్రలు క్షుణ్ణంగా చదవాలన్నారు. దసరా

లావేరు: బహుమతిని అందజేస్తున్న శ్రీనివాసరావు

సెలవుల సందర్భంగా గ్రంథా లయంలో విద్యార్థులు పంచతంత్రం కథలను చదివి వినిపించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహా యకులు ఎ.గడ్డియ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

సమిష్టి కృషితోనే విజయవంతం

మాట్లాడుతున్న సాయిరాజ్

ఇచ్ఛాపురం :ఈ నెల 26న జరగనున్న సామాజిక సాధికారిత బస్సు యాత్ర సమిష్టి కృషితో విజయవంతం చేయాలని వైసిపి ఇన్‌ఛార్జి పిరియా సాయిరాజ్, ఎమ్మెల్సీ నర్తు రామారావు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పార్టీ ప్రజా ప్రతినిధులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. మాజీ శాసన సభ్యులు పిరియా సాయిరాజ్ మాట్లాడుతూ రాజ్యాధికారం అన్ని వర్గాలకు అందించాలన్న ధ్యేయంతో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. రాబోయే అక్టోబర్ 26న నియోజకవర్గంలోనే సామాజిక సాధికార బస్సుయాత్ర మొదలవు తుందని కార్యక్రమాన్ని విజయ వంతం నాయకులను కోరారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ ఛైర్ పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, వైస్ మున్సిపల్ ఛైర్ పర్సన్ ఉలాల దివ్య భారతి, ఉప్పడ రాజారెడ్డి, టౌన్ పార్టీ అధ్యక్షులు బలివాడ ప్రకాష్ పట్నాయక్, టౌన్ జెసిఎస్ అధ్యక్షులు సాలిన ఢిల్లీరావు, మండల జెసిఎస్ అధ్యక్షులు పురుషోత్తం పాల్గొన్నారు.

సమగ్రతను కాపాడాలి

శ్రీకాకుళం అర్బన్ : పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయెల్ దాడులు ఆపాలని, పాలస్తీనా సమగ్రతను కాపాడి అక్కడ ప్రజల జీవనస్థితిని మెరుగుపరచాలని అఖిలభారత శాంతి సంఘీభావ సంఘం డిమాండ్ చేసింది. నగరంలోని మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద శాంతి ప్రదర్శన నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టింది. సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ అమెరికా సామ్రాజ్య వాదం అండతో ఇజ్రాయెల్ పాలస్తీనాపై దాడి కొన సాగిస్తోంద న్నారు. ఐరాస తీర్మానాన్ని అమలు చేసే పాలస్తీనాకు అండగా నిలబడాలని డిమాండ్ చేశారు.

రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో తెల్లదోమ సోకడం వల్ల వేలాది ఎకరాల్లో సాంబ మసూరి, స్వర్ణ, 1060 రకం వరి పంట పూర్తిగా నష్టపోయి రైతులు ఆందోళన చెందుతున్నారని, వారిని ప్రభుత్వం ఆదుకోవాలని ఎపి రైతు సంఘం (సిపిఐ) ఉమ్మడి జిల్లా కార్యదర్శి బుడితి అప్పలనాయుడు డిమాండ్ చేశారు. శ్రీకాకుళం మండలంలోని నైర, పొన్నాం, బట్టేరు గ్రామాల్లో తెల్లదోమ సోకి పాడైన వరి పంట పొలాలను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెట్టిన పెట్టుబడులన్నీ దోమపోటుతో రైతులు నష్టపోయారని అన్నారు. ఎన్ని రకాలైన మందులు పిచ్చికారీ చేసినా దోమపోటు ఉధృతం అవుతుందే తప్ప తగ్గడం లేదని అన్నారు. రోజురోజుకీ పంట నష్టపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే జిల్లాను కరవు జిల్లాగా ప్రకటించి రైతాంగాన్ని ఆదుకోవాలన్నారు. ఆయనతో పాటు జిల్లా కార్యదర్శి బలగ శ్రీరామ్మూర్తి, జిల్లా కన్వీనర్ గుడ్ల రామకృష్ణ, చింతు ఎర్రయ్య, కింజరాపు ఆదినారాయణ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురంలో దీర్ఘ కాలికంగా నెలకొన్న పలు రైల్వే సమస్యలు పరిష్కారం చేయాలని నియోజకవర్గ బిజెపి కన్వీనర్ బి.నిర్మలారెడ్డి శ్రీకాకుళంలో రాజ్యసభ సభ్యులు, బిజెపి నాయకులు జివిఎల్. నరసింహారావుకు వినతిపత్రం సమర్పించారు. శ్రీకాకుళంలో జరిగిన సమావేశం సందర్భంగా ఇచ్ఛాపురంలో నెలకొన్న పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. తీర ప్రాంతంలో ఉన్న మత్స్యకారులు అభివృద్ధి, బాహుదా నదిపై చెక్‌డ్యాం నిర్మాణం, వరదగట్టు నిర్మాణాలు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందించినట్లు తెలిపారు. ఈమెతో పాటు స్థానిక నేతలు ఉన్నారు.